# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

23 శుక్రవారం అక్టోబర్ 2026 | పేజీలు: 3


## చదువుతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు

- డీఎస్పీగా ఆంజనేయులు విజయం
- జనయేత్రీ ఫౌండేషన్ అభినందన





**మిర్యాలగూడ,అక్టోబర్ 22(సత్యనిష్ఠ):** పట్టుదల, కృషి, నిరంతర సాధనకు చదువు తోడైతే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని గ్రూప్-1 పరీక్షలో విజయం సాధించి డీఎస్పీగా ఎంపికైన ఆంజనేయులు నిరూపించారని జనయేత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. మునిర్ అహ్మద్ షరీఫ్ అన్నారు. డీఎస్పీగా ఎంపికైన ఆంజనేయులును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయులు సాధించిన విజయం నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నా లక్ష్యంపై స్పష్టత, కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసం ఉంటే గమ్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. చిన్నతనంలోనే తల్లి క్యాన్సర్ వ్యాధితో మరణించినా, ఆంజనేయులు చదువు కొనసాగించడానికి అండగా నిలిచి లక్ష్య సాధనకు తోడ్పడిన అక్క, బావలను ప్రత్యేకంగా అభినందించారు. ఒక వ్యక్తి విజయం వెనుక కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, త్యాగం కీలకమన్నారు. నేటి యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, చదువు ఉద్యోగానికే కాకుండా జీవితంలో గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని సూచించారు. ఆంజనేయులు భవిష్యత్తులో పోలీసు శాఖలో ప్రజలకు సేవలందిస్తూ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆర్గనైజర్ సెక్రటరీ రషీద్, ప్రశాంత్, పరమేష్, రమేష్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం



**గరిడేపల్లి, అక్టోబర్ 22 (సత్యనిష్ఠ):**నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని పొనుగోడు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు, నాలుగు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక యువతను పూర్తిగా మర్చిపోయారని విమర్శించారు. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పి వారిని కూడా మభ్యపెట్టారన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి ఏటా టీఎస్పీఎస్సీ ద్వారా వేలాది ఉద్యోగాలు భర్తీ చేస్తే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క భారీ నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడం వారి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలకు ఇప్పటి వరకు నియామక పత్రాలు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వకపోగా ఇవ్వాల్సిన డీఏలలో కేవలం రెండు డీఏలు మాత్రమే ఇచ్చి కంటి తుడుపు చర్యలు చేపట్టారన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని, నిరుద్యోగుల పక్షాన నిరంతరం పోరాడే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మేళ్లచెరువు వెంకటరమణ, మాజీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, వార్డు మెంబర్లు అనంతు కరుణాకర్ గౌడ్, రామ్ మధు, నాయకులు బిల్లా వెంకటేశ్వర్లు, అనంతు చంద్రయ్య గౌడ్, నందిపాటి నరహరి, రామ్ సతీష్, పొలంపల్లి మహా ఆంజనేయులు, బత్తిని మహేష్, రామ్ సంపత్, మామిడి నవీన్, కురి శివ, చామకూరి సైదులు, నందిపాటి కార్తిక్, నందిపాటి శ్రవణ్, రణపంగ సుందర్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 25, 26 తేదీలలో ఇందిరా ఉద్యానవనం వద్ద మహాధర్నా



- ధర్నాను జయప్రదం చేయండి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

**పెద్దకందుకూరు (యాదగిరిగుట్ట), అక్టోబర్ 22( సత్య నిష్ఠ):**ఈ నెల 25, 26 తేదీలలో హైదరాబాద్ లోని ధర్నా ప్రదేశం (ఇందిరా ఉద్యానవనం) వద్ద సీఐటీయూ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే "బహుళ దిన మహాధర్నా"లో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. గురువారం యాదగిరి గుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ పేలుడు పదార్థాల ప్రైవేటు పరిమిత పరిశ్రమ వద్ద స్థానిక ప్రీమియర్ సంఘం నాయకులతో కలిసి మహాధర్నా గోడ ప్రచార పత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, పెద్ద సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న తీరును ఎండగట్టేందుకే ఈ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 25న ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, అక్టోబర్ 26న ప్రభుత్వ రంగ ఉద్యోగులు, పథక కార్మికులు, ఒప్పంద, బాహ్య వనరుల మరియు అసంఘటిత రంగ కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. కేంద్రం తెచ్చిన 4 కార్మిక నియమావళులను రద్దు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.42,000లకు పెంచాలని, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 6 అమలు చేయాలని మరియు ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించి ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచార పత్రాల ఆవిష్కరణలో ప్రీమియర్ సంఘం (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమేష్ తో పాటు సంఘం పదాధికారులు, సంఘ సభ్యులు, ఒప్పంద కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ తీరుతో దూరమవుతున్న బంధాలు

**కోదాడ, అక్టోబర్ 22( సత్య నిష్ఠ):**కార్పొరేట్ తీరుతో ఆప్యాయతలు, అభిమానాలు దూరమవుతున్నాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. కుటుంబంలో అందరూ ఉన్నా ఎవరికి వారు ఒంటరిగా మారుతున్నారని, బంధాలు సోషల్ మీడియాకే పరిమితమవుతున్నాయని, సాంకేతికతతో సామాజిక సంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



# గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



సత్యనిష్ఠ ఆర్‌సి హుజుర్నగర్ గరిడేపల్లి:గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కమిటీ అధ్యక్షులు: దుబాస్ యోసేపు

ఉపాధ్యక్షులు: కొత్తపల్లి జోసెఫ్ గారు- కార్యదర్శి: నూకపంగు ప్రభుకిరణ్ -జాయింట్ సెక్రటరీ: శ్రీకాంత్

కోశాధికారి: బండారు సాల్మన్ రాజు

కమిటీ బాధ్యులు: మండల చైర్మన్‌గా అమరారపు పాలు గౌరవ అధ్యక్షులుగా జాకపు రాజు కరుణాకర్ రెడ్డి గారు, ఇమ్మానియేల్ , గౌరవ సలహాదారులుగా మీసాల పుష్పరాజు సుధాకర్ గాబ్రియేలు వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ దయాకర్ గారు, రాజు గారు, పేతురు గారు, సురేష్ గారు, రవి నాయక్ గారు, సంసోను గారు, పుష్పమ్మ గారు, ప్రభాకర్ గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. మండలంలోని పాస్టర్లందరినీ ఐక్యంగా ముందుకు నడిపిస్తూ, సువార్త పరిచర్యను విస్తరించడంతో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధికి, సమాజ సేవకు నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సహకరించిన మండల పాస్టర్లందరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోదాడలో ఘనంగా అమరుడు అష్ఫాకుల్లా ఖాన్ జయంతి వేడుకలు

## స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్ త్యాగాలు చిరస్మరణీయం



కోదాడ - అక్టోబర్ 22 (సత్యనిష్ఠ) కోదాడ పట్టణం లోని షాదీఖానాలో స్వాతంత్ర్య సమరయోధులు, అమరుడు అష్ఫాకుల్లా ఖాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అష్ఫాకుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముస్లిం మైనార్టీ కోదాడ డివిజన్ అధ్యక్షులు షేక్ బాజాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో అష్ఫాకుల్లా ఖాన్ చేసిన త్యాగాలు,దేశభక్తి యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహావీరుల ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ కోదాడ డివిజన్ అధ్యక్షులు షేక్ బాజాన్, కౌన్సిలర్లు షాబుద్దీన్, షేక్ షఫీ, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు కాంపాంటి శ్రీను, ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు యస్ దాని, మండల అధ్యక్షుడు ఖలీల్, నజీర్, పట్టణ కార్యదర్శి ఖలీల్, సంజీవ్,జహీర్, పాష,రఫీ, కాశీం, అలీ బాయ్, షఫీ, రహీం, మహమ్మద్, నాగుల్,మీరా,శోభన్ వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బాలు నాయక్

- **అమ్మవారి చీరల వేలంపాటలో పాల్గొన్న ఎమ్మెల్యే**



**దేవరకొండ పట్టణం, అక్టోబర్ 22 (సత్యనిష్ఠ):** దేవరకొండ పట్టణంలోని నాలుగో వార్డులో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ భక్తిశ్రద్ధలతో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం పట్టణ పరిధిలోని మార్కండేయ స్వామి ఆలయంలో కొలువుదీరిన దుర్గామాత నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన చీరల వేలంపాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలోని ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులతో కలిసి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పున్న శైలజ వెంకటేశ్వర్లు, మహ్మద్ రయీస్, మారుపాకుల సురేష్ గౌడ్, జింకల లింగయ్య, జింకల మధు, వనం నర్సింహా, జింకల మల్లయ్య, అన్నపూరి ఇస్తారి, మారుపల్లి కొండయ్య, జింకల చిన్న లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీటీసీ కైలాసం మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు : ఎమ్మెల్యే బాలు నాయక్



**కొండమల్లేపల్లి-అక్టోబర్ 22(సత్య నిష్ఠ):** మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ కైలాసం మృతి పట్ల దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కైలాసం పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైలాసం మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన సేవలు, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఒక మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన మరణం పార్టీ శ్రేణులకు తీరని లోటుగా మిగిలిపోతుందని అన్నారు. ఈ కష్టకాలంలో కైలాసం కుటుంబ సభ్యుల కు తన ప్రగాఢ సానుభూ తిని తెలియజేస్తూ, వారికి అన్ని విధాలా మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. భగవంతుడు వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని, కైలాసం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఊట్కూరి వేమన్ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, తేరా సత్యం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జల్,జంగిల్,జమీన్ కోసం పోరాడిన ఆదివాసీ యోధుడు కొమరం భీమ్

- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్-అక్టోబర్ 22 (సత్యనిష్ఠ):**జల్, జంగిల్, జమీన్ (నీరు, అడవి, భూమి) హక్కుల కోసం పోరాడిన ఆదివాసీ వీరుడు,పోరాట యోధుడు కొమరం భీమ్ 125వ జయంతి సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆయన చేసిన పోరాటపటమను గుర్తు చేశారు.కొమరం భీమ్ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప విప్లవ యోధుడని కొనియాడారు.ఆదివాసీ ప్రజల జీవనాధారమైన నీరు, అడవి,భూమిపై వారికి సంపూర్ణ హక్కులు ఉండాలని నినదిస్తూ, వారి ఆత్మగౌరవం,స్వేచ్ఛ,హక్కుల సాధన కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడని పేర్కొన్నారు.కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి నేటికీ ఆదివాసీలకే కాకుండా సమాజంలోని అణగారిన వర్గాలందరికీ ఆదర్శమని అన్నారు. బడుగు,బలహీన వర్గాలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, సామాజిక న్యాయం సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ వీరుల చరిత్రను భావితరాలకు తెలియజేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కొమరం భీమ్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని జాజుల లింగం గౌడ్ అన్నారు.

# ఆర్య వైశ్యుల ఔదార్యం పేదంటి విద్యార్థికి ఆనందం



**కోదాడ - అక్టోబర్ 22 (సత్యనిష్ఠ)** సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ పరిధి లోని నడిగూడెం మండలం కరివిరాల గ్రామ వాస్తవ్యులు అయిన జల్ల వెంకన్న కుమార్తె సాయి భవిత కాలేజీ ఫీజు నిమిత్తం మండల ఆర్యవైశ్య సంఘం తరపున ఈరోజు 20216/- రూపాయలు కరివిరాల వెళ్లి ఇవ్వడం జరిగినది. ఆర్య వైశ్యుల ఔదార్యం ( క్రైడ్నెస్-విశాల హృదయం కలిగిన వారు ) పేద ఇంటిలో ఆనందం, ఈ యొక్క కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అర్వపల్లి పల్లి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి వందనపు చంద్ర మోహన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ సహాయ కార్యదర్శి చెన్నూరు వెంకటేశ్వర్లు, మరియు చల్లా అశోక్ కుమార్, చిత్తలూరి చంద్రశేఖర్ పాల్గొనడం జరిగింది.

# ఎండిన పంటలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు

- ముఖ్యమంత్రితో సహా మంత్రులంతా క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులుబి.వి. రాఘవులు
- చర్లపల్లి లో సిపిఐఎం బృందం కరువు పరిస్థితులను పరిశీలన

**నల్లగొండ-అక్టోబర్ 22 (సత్యనిష్ఠ):** ఎలినోవా ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రితో సహ మంత్రులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. గురువారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం చెర్లపల్లి గ్రామంలో ఎలినోవా ప్రభావంతో ఎండిపోయిన పంట పొలాలను సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకత్వం, రైతు సంఘం నాయకులతో



కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బి.వి. రాఘవులు మాట్లాడుతూ.. లిలి"చెర్లపల్లి గ్రామంలో ప్రధానంగా వరి, పత్తి పంటలు సాగు చేశారు. వరి పంట పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొన్ని చోట్ల పంట పూర్తిగా ఎండిపోయింది. తాలు తప్ప గింజ కనిపించని పరిస్థితి నెలకొంది. మరో తడువు నీరు అందితే పంట చేతికొచ్చేది. మొత్తం పెట్టుబడి పెట్టి పంట దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు చివరికి ఒక్క పైసా కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడింది. ఇది చాలా దుర్భరమైన పరిస్థితి. చిన్న, సన్నకారు రైతులు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోతే వారి జీవితాలు ఎంత హృదయవిదారకంగా ఉంటాయో ఇక్కడి రైతుల పరిస్థితిని చూస్తే అర్థమవుతోంది" అని అన్నారు.

**పత్తి పంట పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది**

"పత్తి చేలు పైకి పచ్చగా కనిపిస్తున్నప్పటికీ ఆకులన్నీ వాడిపోయాయి. మరో వారం రోజులు వర్షం లేకపోతే పత్తి పంట కూడా పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే వర్షాభావం వల్ల పంట పెరుగుదల లేదు. కాపు కాసిన కాయలు కూడా ఎండిపోయి రాలిపోతున్నాయి. భవిష్యత్తులో మళ్లీ వర్షాలు పడతాయనే గ్యారెంటీ కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందో తక్షణమే ప్రకటించాలి" అని రాఘవులు డిమాండ్ చేశారు.

## ఈనెల 24 25 తేదీల్లో అఖిల భారత మహిళా జర్నలిస్టుల సదస్సు

**హైదరాబాద్-అక్టోబర్ 22( సత్య నిష్ఠ):** ఈ నెల 24, 25 తేదీలలో (శనివారం-ఆదివారం) రెండు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా మన జాతీయ సంఘం ఐజేయూ ఆధ్వర్యంలో అఖిల భారత మహిళా జర్నలిస్టుల సదస్సు జరగనుంది. మన సంఘం టీయూడబ్ల్యూజే ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నది. ఐజేయూ ముఖ్య నాయకులు మన సలహాదారు, అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ నాయకులు దేవులపల్లి అమర్, ఐజేయూ ఉపాధ్యక్షులు మన రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మజీద్, నగునూరి శేఖర్, కొణిజేటి సత్యనారాయణ పాల్గొననున్నారు. మనది యూనియన్ అనుబంధ సంఘాల్లో ఒకటి కాబట్టి సదస్సును విజయవంతం చేయాల్సిన బాధ్యత మనపైన కూడా ఉంది. కాబట్టి మన సంఘంలోని మహిళా ఎడిటర్లు అందరూ పాల్గొనాలని కోరుతు న్నాం. అలాగే మన పత్రికలలో పనిచేస్తు న్న మహిళా జర్నలిస్టులు పాల్గొనేలా చూడాలి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి మహిళా జర్నలిస్టులు పాల్గొంటున్నారు.

**సదస్సు వివరాలు**

వేదిక: బేగంపేటలోని టూరిజం ప్లాజా

తేదీలు: అక్టోబర్ 24, 25 సదస్సులో పాల్గొనే మహిళా జర్నలిస్టులకు సదస్సు జరిగే చోటనే భోజన, వసతి సౌకర్యం కల్పించబడుతుంది. హైదరాబాద్ వెలుపలి ప్రాంతాల నుండి వచ్చేవారికి ప్రత్యేకంగా వసతి కల్పించబడుతుంది.

**పేర్ల నమోదు:**

సదస్సులో పాల్గొనేవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మీ పేరు, పనిచేస్తున్న పత్రిక పేరు, సెల్ నంబర్ ను నా నంబర్ 98480 43599 కు పంపండి. ఇప్పటికే పంపినవారు మళ్లీ పంపనవసరం లేదు.

గమనిక: పేర్లు నమోదు చేసుకున్న మహిళాఎడిటర్లు, జర్నలిస్టులకు మాత్రమే సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశం ఉంటుంది. ఇతరులకు అనుమతి లేదు. పురుష జర్నలిస్టులు, ఎడిటర్లు ఎవరూ రావద్దు. వచ్చి నిరాశ చెందవద్దు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి, ఇతర అధికారులు, ముఖ్య మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

## తెలంగాణ రాబిన్ హుడ్ సాయుధ పోరాట యోధుడు పండుగ సాయన్న

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్

జాజుల లింగం గౌడ

**హైదరాబాద్-అక్టోబర్ 22 (సత్యనిష్ఠ):** నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాములు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి, పేద ప్రజల పక్షాన నిలిచిన ధీరుడు, బహుజనుల బంధువు, తెలంగాణ రాబిన్ హుడ్‌గా పేరుగాంచిన వ్యక్తి పండుగ సాయన్న అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు ఆయన 174వ జయంతి సందర్భంగా మాట్లాడుతూ,పండుగ సాయన్న తన కాలంలో నెలకొన్న సామాజిక అసమానతలు, భూస్వాముల దోపిడీ, నిజాం పాలనలోని నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడి, వారి



హక్కుల సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. పండుగ సాయన్న జీవితం నేటి బహుజన సమాజానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు



ఐక్యంగా సామాజిక న్యాయం, సమాన హక్కులు, రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. చరిత్రలో బహుజన వీరుల త్యాగాలకు తగిన గుర్తింపు లభించాలని, వారి చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తితో బహుజన సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

## ట్యాంక్ బండ్ పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు అభినందనీయం

- మరి బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించరా?
- కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించాలి
- ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్



**హైదరాబాద్, అక్టోబర్ 22( సత్య నిష్ఠ):** తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలను ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను స్మరించుకోవడం అభినందనీయమని, అయితే బీసీలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.బీసీలకు కేవలం మహనీయుల విగ్రహాలు, జయంతి ఉత్సవాలకే పరిమితం కాకుండా పాలనలోనూ, నిర్ణయాధికారంలోనూ సముచితమైన భాగస్వామ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలకు కేటాయించాలని, బీసీల జనాభా దామాషా, సామాజిక న్యాయం ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా త్వరలో భర్తీ చేయనున్న గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీ నాయకులకు అవకాశం కల్పించి బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.